12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 34 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 8 అక్టోబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :34 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 8 OCTOBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం



- 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం
- భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

- మిగతా 2లో

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా
- విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం,

- మిగతా 2లో

## ఢిల్లీలో సీఎం చంద్రబాబు.. నిర్మలా సీతారామన్‌తో భేటీ,

# రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చ

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ
- రెండు రోజుల పర్యటనలో ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం
- విశాఖ మెట్రో, పోలవరం, పుష్కరాల నిధులపై విజ్ఞప్తి చేసే అవకాశం
- నేడు సీఐఐ సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు. (అక్టోబర్ 8) మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని నేడు రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోదీ 25 ఏళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.



# రణరంగంగా మారిన ఢిల్లీ..

# రాహుల్, ప్రియాంక అరెస్ట్..

## బలవంతంగా వాహనంలోకి ఎక్కించిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్: జంతర్ మంతర్ వద్ద లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, ప్రియాంకా వాద్రాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , 'ఓట్ చోరీ' ఆరోపణలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ INDIA కూటమి ఎంపీలు అక్టోబర్ 7న బుధవారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగారు.అయితే నిరసనకు అనుమతి లేదంటూ పోలీసులు రాహుల్ ను, విపక్ష ఎంపీలను అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులకు ,కాంగ్రెస్ నేతలకు వాగ్వాదం, తోపులాట జరిగింది. తమపై పోలీసులు దాడి చేశారని,

- మిగతా 2లో



## డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు,

- మిగతా 2లో

## ఏపీలో మరో 58 వేల మందికి

# 'తల్లికి వందనం'..

## క్యాబినెట్ నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ANDHRA PRADESH

- 'తల్లికి వందనం' పథకం విస్తరణకు కేబినెట్ ఆమోదం
- కొత్తగా 58,601 మంది విద్యార్థులకు అందనున్న ప్రయోజనం
- మొత్తం లబ్ధిదారుల సంఖ్య 68 లక్షలు దాటిన వైనం
- దసరా పండుగ లోపు తల్లుల ఖాతాల్లో నగదు జమ

- మిగతా 2లో



## ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

భవిష్యత్తులో టీ, సమోసాలు తింటూ చర్చిస్తామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఇండియా కూటమి ఐక్యత మరోసారి ప్రశ్నార్థకమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఏర్పాటు చేసిన విందుకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ గైర్హాజరయ్యారు. ఈ పరిణామంపై ఆయన చేసిన వ్యాఖ్యలు

- మిగతా 2లో

## డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

- డిసెంబర్‌లో రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని అంచనా
- తాజాగా 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన ఆర్‌బీఐ
- పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ అనిశ్చితి దీనికి ప్రధాన కారణాలు
- డిసెంబర్ నాటికి రెపో రేటు 6 శాతానికి చేరొచ్చన్న ఎస్‌బీఐ రీసెర్చ్

RESERVE BANK OF INDIA

- మిగతా 2లో

## 'రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే..

# అవినీతి అనుకోవాలా?'



పెన్ పవర్ డెస్క్: టీవీకే అధినేత, నటుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో సుమారు రూ.30 కోట్ల విలువైన ఆస్తులు వెల్లడించలేదన్న పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆస్తుల వివరాలు వెల్లడించకపోవడాన్ని నేరుగా 'అవినీతి

- మిగతా 2లో



## రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

- రసాయన శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ప్రకటన
- ఫ్రాన్స్ శాస్త్రవేత్త హెన్రీ కగన్, జపాన్ శాస్త్రవేత్త కెన్సో సోయ్‌లకు పురస్కారం
- అణువుల అసమానత, స్వీయ ఉత్ప్రేరణపై పరిశోధనలకు ఈ గౌరవం
- ఔషధాలు, పరిమళాల తయారీలో కీలకం కానున్న ఈ ఆవిష్కరణలు

- మిగతా 2లో

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి ఛార్జీలు
- ఈ ఛార్జీల వల్ల లావాదేవీల పరిమాణం తగ్గదని ఆర్బీఐ గవర్నర్ స్పష్టత
- ఈ రుసుముల వల్ల కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని కేంద్రం వెల్లడి
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ బదిలీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు



పెన్ పవర్ డెస్క్:యూపీఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# దేశం పరువు పోయిందిగా..

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు “పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్” పంపేందుకు ప్రయత్నించారు.

### తక్షణమే పదవి నుంచి వైదొలగాలని...

జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింది.

### పదమూడు కోట్ల ఓట్లను...

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ాx= ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

# డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- మొదటి పేజీ తరువాయి

అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే ‘ఈగల్ క్లబ్’లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ‘ఆపరేషన్ చైతన్యం’, విద్యాసంస్థల సమీపంలో ‘సేఫ్ క్యాంపస్ జోన్’, యువత కోసం ‘డ్రగ్స్ వద్దు బ్రో’ వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు ‘బ్రేక్ ద సైలెన్స్’ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో 58 వేల మందికి ‘తల్లికి వందనం’.. క్యాబినెట్ నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ‘తల్లికి వందనం’ పథకం పరిధిని విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద కొత్తగా మరో 58,601 మంది విద్యార్థులను అర్హులుగా చేర్చుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పథకం ద్వారా లబ్ధి పొందే వారి సంఖ్య మరింత పెరగనుంది.

తాజా చేర్పులతో రెండో విడతలో ఆర్థిక సహాయం అందుకునే విద్యార్థుల సంఖ్య 3,29,201కి చేరుకుంటుంది. ఫలితంగా, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హులైన మొత్తం విద్యార్థుల సంఖ్య 67,47,190 నుంచి 68,05,791కి పెరగనుంది.

రెండో విడతకు సంబంధించిన నిధులను దసరా పండుగలోపు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా విద్యార్థుల చదువులకు ఆర్థికంగా చేయూత అందించడమే ప్రభుత్వ ఉద్దేశం.

# డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ ‘జంబో హైక్’ వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది.వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే.ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది.చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో (asymmetric organic synthesis) నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ (ఖబ్‌శీమ్ఘ్‌ఖుశ్రీఎంఱం) వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది.ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో (mirror-image forms) ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా ‘హోమోకిరాలిటీ’ ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు.మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

# పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది.తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది.అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు

అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది.

ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

# ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- మొదటి పేజీ తరువాయి

కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ‘విశాఖ ఎకనామిక్ రీజియన్’ కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

## ‘రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే..
# అవినీతి అనుకోవాలా?’

- మొదటి పేజీ తరువాయి

చర్య’గా పరిగణించవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది.

### ఎన్నిక రద్దు చేయొచ్చా?

విజయ్ తన అఫిడవిట్‌లో దాదాపు రూ.600 కోట్ల ఆస్తులను ప్రకటించారని, మరో రూ.30 కోట్ల ఆస్తులు వెల్లడించలేదని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై విచారణ సందర్భంగా న్యాయమూర్తి.. ఒకవేళ ఆస్తుల వివరాలను చార్టర్డ్ అకౌంటెంట్ సిద్ధం చేస్తే, పొరపాటున కొన్ని ఆస్తులు మిగిలిపోతే దాని ఆధారంగా ఎన్నికను రద్దు చేయవచ్చా? అని ప్రశ్నించారు. అలాగే వెల్లడించని ఆస్తుల వివరాల వల్ల పెరంబూర్ ఓటర్ల తీర్పుపై నిజంగా ప్రభావం పడిందా? అనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఈ కేసులో విజయ్ తన ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతున్నారు.

# రణరంగంగా మారిన ఢిల్లీ.. రాహుల్, ప్రియాంక అరెస్ట్..

- మొదటి పేజీ తరువాయి

నిరసన ప్రదేశానికి వెళ్లకుండా అడ్డుకున్నారని ‘ఇండియా కూటమి ఎంపీలు తెలిపారు. దీంతో రాహుల్ ను పోలీసులు బలవంతంగా వాహనం ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. తమను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని, తమపై దాడి చేశారని ×చీణ×ూ కూటమి ఎంపీలు ఆరోపించారు. మరోవైపు, నిరసనకు అనుమతి తీసుకోలేదని, కేంద్ర ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో నిరసనలు, సమావేశాలపై ఆంక్షలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

ఈ వ్యాఖ్యలు చేశారు.బుధవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, “ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు” అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యూపీఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు.గత ఆరేళ్లుగా నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2,000కు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలోనే స్పష్టం చేశారు. ఈ రుసుము ప్రభుత్వానికి కాకుండా, పేమెంట్ సేవలు అందించే సంస్థలకు చేరుతుందని ఆమె తెలిపారు.ఈ ఛార్జీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాల్లో రూ. 2,000 దాటిన చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ. 5 ఫ్లాట్ ఫీజు ఉంటుంది. రూ. 75,000 అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ. 300గా నిర్ణయించారు. అయితే, వ్యక్తుల మధ్య (ూ2ూ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనప్పటికీ ఎలాంటి ఛార్జీలు ఉండవని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ సేవలు యథాతథంగా ఉచితంగానే కొనసాగుతాయి.

# ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

- మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. భవిష్యత్తులో ప్రతిపక్ష నేతల భేటీలు కేవలం భోజనాలకే పరిమితం కావని, టీ తాగుతూ లేదా సమోసాలు తింటూ కూడా చర్చించుకోవచ్చని ఆయన చమత్కరించారు.

జన్‌పథ్‌లోని సాగర్ రత్న హోటల్‌లో ఖర్గే ఏర్పాటు చేసిన విందుకు ఎందుకు హాజరు కాలేదని మీడియా ప్రశ్నించగా అఖిలేశ్ స్పందించారు. “ఇది ఒక్క భోజనంతో ముగిసేది కాదు. భవిష్యత్తులో టీ తాగుతూ సమావేశమయ్యామని కూడా మీరు వినొచ్చు. మేమంతా కలిసి సమోసాలు కూడా తినొచ్చు. చర్చలు కొనసాగుతూనే ఉంటాయి” అని ఆయన వ్యాఖ్యానించారు.అంతకుముందు, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇండియా కూటమి నిర్వహించిన నిరసన ప్రదర్శనలో అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న నేతల్లో ఆయన కూడా ఉన్నారు. అయితే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు ఆకాశవాణి భవన్ వద్ద కొనసాగించిన ధర్నాలో మాత్రం ఆయన పాల్గొనకుండా లక్నోకు తిరిగి వెళ్లారు. బుధవారం నాటి విందుకు, ఆ తర్వాత జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన కార్యక్రమానికి కూడా ఆయన, ఇతర ఎస్పీ ఎంపీలు దూరంగా ఉన్నారు.విందు ఆహ్వానం ఆలస్యంగా అందడం వల్లే అఖిలేశ్ హాజరు కాలేదని సమాజ్‌వాదీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం నాటి నిరసన కార్యక్రమాల్లో చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయాలపై అసంతృప్తి కూడా ఒక కారణంగా తెలుస్తోంది. కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ విషయాన్ని తేలికగా తీసుకుంటున్నారు. మంగళవారం నాటి ఘటనల తర్వాత చాలామంది ఎస్పీ ఎంపీలు ఢిల్లీ నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. అయితే, 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సమన్వయ లోపం ఉందన్న చర్చకు ఈ పరిణామం మరింత బలాన్నిచ్చింది.

# ప్రత్తిపాడులో ఎమ్మెల్యే సత్యప్రభ ఆదేశాలతో ఘనంగా సేవా జ్యోతి యాత్ర.



కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్ 7:కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రధాని శ నరేంద్ర మోదీకి అభినందనలు తెలుపుతూ సేవా జ్యోతి యాత్ర ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాలతో టిడిపి,బీజేపీ, జనసేన శ్రేణులు కలిసి జ్యోతిని వెలిగించి, ప్రధాని మోదీ చిత్రపటంతో యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను కొనియాడారు.మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, ఆయన సేవా నిరతిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం టిడిపి బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




# వీఆర్ఏల సమ్మెకు బహుజన సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 7:** జగ్గంపేట మండల రెవెన్యూ కార్యాలయం వద్ద 22 రోజులుగా వీఆర్ఏలు చేపడుతున్నసమ్మెకు బుధవారం బహుజన సమాజ పార్టీ నాయకుడు జుత్తుక నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో టెంట్లు వేసుకుని శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న వీఆర్ఏలను కార్యాలయ పరిధిలో టెంట్లు వేసుకోవడానికి అనుమతి లేదంటూ బయటకు పంపించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# పిఠాపురం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి





**కాకినాడ/పిఠాపురం,పెన్ పవర్ అక్టోబర్ 7:** పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు వసతులను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, టెండర్ల ప్రక్రియ, నిధుల కేటాయింపులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.తొలి విడతగా రూ.50 కోట్లతో మంజూరైన పనులను సమీక్షించిన కలెక్టర్ ప్రతి పనికి నిర్దిష్ట గడువు విధించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల పరిధిలో ప్రతిపాదించిన పనులను అక్టోబర్ నెలాఖరులోగా ప్రారంభించాలని ఆదేశించారు. పిఠాపురం పట్టణ సుందరీకరణ, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, సామాజిక ఆరోగ్య కేంద్రం, స్కిల్ హబ్, ప్రధాన దేవాలయాల అభివృద్ధి, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులపై సమీక్షించారు. సాగునీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించాలని, పనుల నాణ్యతలో రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.

# గ్రామాల్లో త్రాగునీటి రక్షణకు నిత్యపర్యవేక్షణ



ఎంపీడీవో రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ భాగ్యరాజ్

**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 07:** గ్రామాల్లో త్రాగునీటి రక్షణకు స్థానిక అధికారులు నిత్య పర్యవేక్షణ తప్పకుండా చేయాలని ఎంపీడీవో ఏ.రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఇంచార్జ్ ఏఈ భాగ్యరాజ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో త్రాగునీటి రక్షణకు ప్రత్యేక చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గ్రామాల్లో త్రాగునీటి సరఫరా చేసే ట్యాంకుల నిర్మాణాలలో జాప్యం వద్దన్నారు. అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలో మొట్టమొదటిసారిగా చొప్పెల్ల గ్రామ పంచాయతీ ద్వారా గ్రామస్తులకు సరఫరా చేసే త్రాగునీటి రక్షణ కోసం వాటర్ ట్యాంక్ కు వెళ్లే బోర్ డెలివరీ లైన్ లో డైలీ క్లోరినేషన్ జరిగేలా చర్యలు చేపట్టమన్నారు. ఇందుకు రెండు మోటారుల అవుట్ పుట్ లైన్లో క్లోరినేషన్ సిస్టంలను అమర్చడం జరిగిందన్నారు. దీంతో నీరు మోటారు నుంచి టాంక్ లోకి వెళ్ళే మధ్యలో క్లోరినేషన్ కి కావలసిన టాబ్లేట్లు వేస్తే అవి కరిగి నేరుగా వాటర్ ట్యాంక్ లోకి క్లోరినేషన్ చేసిన నీరు వెళుతుందన్నారు. దీంతో వాటర్ ట్యాంక్ నుండి వెలువడే నీరు కుళాయిలకు సరఫరా అయ్యే లోపల బ్యాక్టీరియా ఉంటే అవి నశించిపోతాయని, తద్వారా పరిపూర్ణమైన త్రాగునీరు గ్రామం లోకి వెళు తుందన్నారు. అలాగే గ్రామాల్లో త్రాగునీటి కుళాయిలు, సరఫరా చేసే గొట్టాలకు ఏమైనా మరమ్మత్తులు ఉంటే ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు విస్తృతంగా అధికారులు వీధుల వారీగా పర్యటిస్తూ సమస్యలను గుర్తించి మరమ్మత్తులు చేయించాలన్నారు. ఇకపై ఇలాంటి వాటిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రేణుక, వెంకటరత్నం, సాయి ప్రసాద్, వేణి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# సుబ్బు కుటుంబ సభ్యులకు పలువురు నాయకులు పరామర్శ



**కిర్లంపూడి,పెన్ పవర్, అక్టోబర్, 07:** ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎరికిరెడ్డి నాగమణి కుటుంబాన్ని పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు పరామర్శించారు. వేలంకలోని నాగమణి నివాసానికి పలువురు నాయకులు చేరుకుని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను, వారి అల్లుడు జర్నలిస్ట్ సుబ్బు తుమ్మలను ఓదార్చారు. నాగమణి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సుబ్బు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు. జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, వైసీపీ సోషల్ మీడియా టీం సభ్యులు గొంతిరెడ్డి సతీష్, గాది చిన్నా, గోనెల బుజ్జి, బందిల చిన్నా, వేలంక నాయకులు నీలగిరి చిట్టిబాబు, దోమాల కృష్ణ జడ్జి, బేతాళ భాస్కరరావు,రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,జగ్గంపేట నియోజకవర్గం, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర,కాకినాడ జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం సభ్యులు పోలిశెట్టి శ్రీనివాస్, రావూరి తాతాజీ, శృంగరాయునిపాలెం మాజీ సర్పంచ్ గొడే బాల, మాజీ ఎంపీటీసీ గరగా గోవింద్, మాజీ ఉప సర్పంచ్ బొజ్జపు శ్రీనివాస్, పెద్దనాపల్లి మాజీ సర్పంచ్ బుద్ద సూర్యప్రకాష్, రాష్ట్ర వైసీపీ రైతు విభాగం సంయుక్త కార్యదర్శి, తొండంగి మాజీ సర్పంచ్ పెదిరెడ్ల సురేష్, వైసీపీ సోషల్ మీడియా టీం సభ్యులు పెదిరెడ్ల దుర్గాప్రసాద్, జ్యోతుల కాశీ, కాలిన అనిల్‌కుమార్ యాదవ్ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ పోల్నాటి లక్ష్మీనారాయణ, ప్రముఖ న్యాయవాది, జనసేన నాయకులు జోకా శ్రీనివాస విజయకుమార్, నక్కా అప్పలరాజు, కిర్లంపూడి మాజీ ఎంపీపీ కంచుమర్తి రాఘవ, కిర్లంపూడి హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు చినబాబు, సోమవరం టీడీపీ నాయకులు సూతి శ్రీను, జంపన రవివర్మ, నైదాన రవివివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, స్థానిక నాయకులు సుబ్బు తుమ్మల కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, నాగమణి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# మడికిలో గర్భిణులకు సామూహిక సీమంతాలు



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 07:** పండంటి బిడ్డలకు జన్మనివ్వబోతున్న ఆడపడుచులకు సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారికి ఆత్మీయతను పంచుతూ సామూహిక సీమంతాలు చేయడం మన కర్తవ్యం అని టీడీపీ గ్రామ అధ్యక్షుడు దొండపాటి సుబ్బరాజు అన్నారు. ప్రధాని మోడీ జన్మదినోత్సవ మహోత్సవాలు, సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఏ.గజలక్ష్మి సూచనల మేరకు, ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.వరలక్ష్మి దేవి ఆధ్వర్యంలో మండలంలోని మడికి శివారు నాగులపేట కేంద్రంలో అంగన్వాడీల అభినందన ఉత్సవం, గర్భిణుల సీమంతోత్సవాన్ని ఆయన ఆధ్వర్యంలో కూటమి నాయకుల సౌజన్యంతో బుధవారం ఘనంగా నిర్వహించారు. మడికిలో ఐదు అంగన్వాడీ కేంద్రాలకు చెందిన గర్భిణులను ఆడపడుచులుగా భావించి, పండ్లు, చీర, గాజులు, పసుపు, కుంకుమ, పూలతో సత్కరించి ఆత్మీయంగా ఆశీర్వదించారు. దీంతో గర్భిణుల కుటుంబాల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ గర్భిణులు తీసుకునే పౌష్టికాహారంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించుకోవాలని సూచించారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి, తల్లి ఆరోగ్యమే పునాదని, గర్భధారణ సమయంలో పౌష్టికాహార లోపాలు అధిగమించేలా శ్రద్ధ వహించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణపై తల్లులకు పలు సూచనలు చేశారు. గర్భధారణ దశ నుంచి ప్రసవం వరకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, టీకాలు, ఇతర సదుపాయాలను ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించి, అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేయించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆడపడుచులు ఎలాంటి అవసరం వచ్చినా తనను సొంత సోదరుల వలె భావించాలని,వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా కూటమి నేతలు భరోసా ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తల సేవలను గుర్తిస్తూ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమంలో అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో అంగన్వాడి సెక్టార్ లీడర్ మెర్సీ ఫ్లోరెన్స్, కూటమి నేతలు అడ్డాల రాజు, ఈదర రమేష్, పంపన అంజిబాబు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సూరంపాలెంలో 'భూ' దందా?

- కోర్టు హెచ్చరికలున్నా నిర్మాణాల జోరు... ప్రభుత్వ భూములపై ఎవరి కన్ను?
- 'పెన్ పవర్' ప్రత్యేక పరిశోధన --- ఎపిసోడ్--1
- గ్రౌండ్ రిపోర్ట్ । గండేపల్లి మండలం, కాకినాడ జిల్లా
- సర్వే నంబర్లు 202, 206/2 చుట్టూ వివాదం
- పేదలకు ఇచ్చిన 'డి-పట్టా' భూముల పరిస్థితి ఏంటి?
- కొండను చదును చేశారన్న ఆరోపణలు... అనుమతులు ఎవరిచ్చారు?
- కోర్టు హెచ్చరిక బోర్డులు ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు ఎలా జరిగాయి?
- ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత ఎవరిది?

**గండేపల్లి: పెన్ పవర్, అక్టోబర్ 07:**కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూముల వినియోగంపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పేదలకు జీవనాధారం కల్పించాలనే ఉద్దేశంతో గతంలో కేటాయించిన భూముల్లో కొన్నిచోట్ల భారీ నిర్మాణాలు వెలిసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రధానంగా సర్వే నంబర్లు 202, 206/2 పరిధిలోని భూములపై వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలోని కొన్ని భూములు గతంలో నిరుపేదలకు 'డి-పట్టా'ల రూపంలో కేటాయించారని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.అయితే కాలక్రమేణా అసలు లబ్ధిదారుల స్థానంలో ఇతరుల ఆధిపత్యం పెరిగిందా? పట్టా భూముల స్వరూపం మారిందా? ప్రభుత్వ భూమి, పట్టా భూమి మధ్య సరిహద్దులు ఎక్కడ? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**కొండను చదును చేశారా?**

వివాదాస్పద భూములకు ఆనుకుని ఉన్న కొండ ప్రాంతంలో కూడా భారీ స్థాయిలో మట్టి తొలగింపు, చదును పనులు జరిగినట్లు స్థానికుల ఆరోపణ.కొండ ప్రాంతాన్ని మార్చాలంటే రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ, పర్యావరణ పరమైన అనుమతులు అవసరమయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడ జరిగిన పనులకు సంబంధించి ఏ శాఖ అనుమతి ఇచ్చింది? ఏ మేరకు భూమి స్వరూపం మార్చబడింది? అధికారిక రికార్డుల్లో ఏముంది? అనే ప్రశ్నలకు సమాధానం రావాలి.

**కోర్టు బోర్డులున్నా నిర్మాణాలా?**

ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టరాదంటూ కోర్టు ఆదేశాలకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.అలాంటి పరిస్థితుల్లోనే వాణిజ్య అవసరాలకు ఉపయోగపడేలా భారీ భవనాలు వెలిశాయని ఆరోపిస్తున్నారు.
కోర్టు ఆదేశం ఏ భూమికి వర్తిస్తుంది?
దాని పరిధి ఎంత?
ఆదేశం ప్రస్తుతం అమల్లో ఉందా?
నిర్మాణాలు ఆ తర్వాత జరిగాయా? లేక అంతకుముందే జరిగాయా?
ఈ అంశాలన్నీ సంబంధిత కోర్టు ఉత్తర్వులు, రెవెన్యూ రికార్డులు, నిర్మాణ అనుమతులను పరిశీలించినప్పుడే పూర్తిగా తేలనున్నాయి.

**ప్రభుత్వ భూమి అయితే రక్షణ ఎవరి బాధ్యత?**

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ వ్యవస్థకు కీలక బాధ్యత ఉంటుంది. గ్రామస్థాయి నుంచి మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించడం, అవసరమైతే తొలగించడం అధికార యంత్రాంగం బాధ్యత.
అయితే సూరంపాలెంలో వివాదం ఏళ్ల తరబడి కొనసాగుతోందని స్థానికులు చెబుతున్న నేపథ్యంలో---
అధికారిక సర్వే జరిగిందా?
హద్దులు గుర్తించారా?
ఆక్రమణ కేసులు నమోదు చేశారా?
నోటీసులు ఇచ్చారా?
తదుపరి చర్యలు ఏమయ్యాయి?
అన్నది వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**ఎపిసోడ్--2లో...**

అనుమతులు లేకుండా కరెంట్ ఎలా వచ్చింది?
వాటర్ కనెక్షన్లు ఎవరు ఇచ్చారు?
పంచాయతీ ఫైళ్లలో ఏముంది?
కుడా అనుమతులు ఉన్నాయా?

## పలివెలలో అయోడిన్ లోపంపై విద్యార్థులకు స్క్రీనింగ్






**కొత్తపేట,పెన్ పవర్,అక్టోబర్ 7:** జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నియంత్రణ కార్యక్రమం (ఎన్ఐడీడీసీపీ)లో భాగంగా పలివెల గ్రామంలోని సెయింట్ జాన్స్ ప్రైమరీ, హైస్కూల్‌లో విద్యార్థులకు గాయిటర్ నిర్ధారణ కోసం బుధవారం స్క్రీనింగ్ నిర్వహించారు. జిల్లా స్థాయి ఎన్ఐడీడీసీపీ సర్వే 2026--27లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 90 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.విద్యార్థులు ఇంటివద్ద వినియోగిస్తున్న ఉప్పులో అయోడిన్ ఉందో లేదో నిర్ధారించేందుకు 18 మంది నుంచి ఉప్పు నమూనాలను సేకరించారు. అలాగే అయోడిన్ ఉప్పు వినియోగిస్తున్నారా లేదా అన్నది మూత్ర పరీక్షల ద్వారా నిర్ధారించేందుకు తొమ్మిది మంది విద్యార్థుల నుంచి మూత్ర నమూనాలను సేకరించారు. వీటిని పరీక్షల నిమిత్తం విజయవాడకు పంపేందుకు ఏర్పాట్లు చేశారు.కోనసీమ జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుమలత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శ్రీదివ్య, ఆరోగ్య విస్తరణాధికారి రామలింగేశ్వరరావు, పీహెచ్ఎన్ మణికుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్ మాచరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వైభవానికి తోడ్పాటును అందిస్తున్న చిన్నబాబు.

- భజన మండలికి రూ.30 వేల విలువైన డోలకం, హార్మోనియం అందజేత.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 07:**గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ, భక్తి కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్న ఈదర శ్రీరామచంద్రమూర్తి (చిన్నబాబు) మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. పెనికేరు గ్రామానికి చెందిన మహిళలు ఏర్పాటుచేసుకున్న శ్రీ విజయ దుర్గ భజన మండలికి సుమారు రూ.30 వేల విలువైన డోలకం, హార్మోనియం వాయిద్యాలను అందజేశారు. గ్రామంలోని కొంతమంది మహిళలు భక్తి భావంతో భజన మండలిగా ఏర్పడి భజనలు నేర్చుకుంటున్నారు. భజన కార్యక్రమాలను మరింత ఆధ్యాత్మిక శోభతో నిర్వహించేందుకు డోలకం, హార్మోనియం అవసరమని వారు ఈదర చిన్నబాబును కోరగా, వెంటనే స్పందించిన ఆయన స్వయంగా వాయిద్య పరికరాలను సమకూర్చి భజన మండలి సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ముందుగా ఈదర చిన్నబాబు నివాసం వద్ద శ్రీ విజయ దుర్గ భజన మండలి సభ్యులు భక్తి శ్రద్ధలతో భజనలు నిర్వహించారు. భక్తిగీతాలతో ఆ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. అనంతరం భజన మండలి గురువును సాలువాతో ఘనంగా సత్కరించారు. భక్తి కార్యక్రమాలకు అండగా నిలుస్తూ, గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు తనవంతు సహకారం అందిస్తున్న ఈదర చిన్నబాబును భజన మండలి సభ్యులు అభినందించారు. భజన మండలికి అవసరమైన వాయిద్య పరికరాలను అందించి ఆధ్యాత్మిక వైభవానికి తనవంతు తోడ్పాటును అందించిన చిన్నబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 22వ రోజు సమ్మెలో వీఆర్ఏల వంటా--వార్పు.



**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 07:**మండల కేంద్రమైన ఆలమూరులో తాసిల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన సహాయ నిరాకరణ సమ్మె 22వ రోజు కొనసాగిస్తున్న సందర్భంగా బుధవారం వీఆర్ఏల మండల అధ్యక్షులు తాతపూడి ఇస్సాకు ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఎ లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేశారు.ప్రస్తుతం అందుతున్న రూ.10,500 గౌరవ వేతనంతో జీవనం సాగించడం ఎంతో కష్టంగా ఉందని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలి, అర్హత కలిగిన వీఆర్ఎ లకు ప్రమోషన్లు కల్పించాలి, నామినీగా పనిచేస్తున్న వీఆర్ఎ లను క్రమబద్ధీకరించాలి, వీఆర్ఎ ల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ ప్రధాన డిమాండ్లుగా వారు తెలియజేశారు.ప్రభుత్వం వీఆర్ ల సమస్యలపై సానుకూలంగా స్పందించి, తక్షణమే చర్చలు జరిపి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

## మడికి యువకుడి హత్య కేసులో నిందితుడు అరెస్ట్.



- రమేష్ మృతి అనుమానస్పదం కాదు హత్యే
- వివాహేతర సంబంధమే దీనికి కారణం
- ప్రెస్ మీట్ లో వివరాలు వెల్లడించిన పోలీసులు

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 07:**మండలంలోని మడికి గ్రామ పంచాయతీ పరిధిలో గత నెలలో జరిగిన మింగి రమేష్ (24) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం కారణంగానే ఈ హత్య జరిగినట్లు నిర్ధారించి, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం పత్రికా సమావేశంలో పోలీసుల కథనం ప్రకారం.. చిలకలపాడుకు చెందిన మింగి రమేష్ అనే యువకుడు నర్సరీ పనులు చేసుకునేవాడు. అతనికి మడికి గ్రామానికి చెందిన గంపా దుర్గాప్రసాద్ భార్య అనూషతో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో, అనూష గత ఆరు నెలలుగా తన ఐదేళ్ల కూతురితో కలిసి విడిగా అద్దె ఇంట్లో ఉంటోంది. రమేష్ తరచూ ఆమె వద్దకు వస్తూ వెళ్తుండటాన్ని గమనించిన భర్త దుర్గాప్రసాద్, అతనిపై తీవ్ర కక్ష పెంచుకున్నాడు.గత నెల 29న రాత్రి రమేష్ తన స్కూటీని అనూష ఇల్లు వెనుక ఉన్న కార్తికేయ నర్సరీలో పార్క్ చేసి ఆమె ఇంటికి వెళ్లాడు. ఇది గమనించిన దుర్గాప్రసాద్ నర్సరీలోనే పొంచి ఉన్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1 గంట సమయంలో రమేష్ తిరిగి స్కూటీ వద్దకు రాగా, దుర్గాప్రసాద్ అతనితో గొడవకు దిగాడు. కోపంతో రమేష్ మెడలోని పూసల దండతో పీక నొక్కి, చాకుతో పొట్టలో పొడిచి, కింద పడేసి మొహంపై పిడిగుద్దులు గుద్ది ఊపిరాడకుండా చేసి దారుణంగా హత్య చేశాడు.సెప్టెంబర్ 30న ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా నమోదైన కేసును, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో విచారించి అక్టోబర్ 5న హత్య కేసుగా మార్చారు. రావులపాలెం రూరల్ సి.ఐ సిహెచ్. విద్యాసాగర్ మంగళవారం (అక్టోబర్ 6) సాయంత్రం మడికి గ్రామంలో నిందితుడు గంపా దుర్గాప్రసాద్ (26)ను అరెస్ట్ చేసి, బుధవారం కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఇంకా ఎవరికైనా ప్రమేయం ఉందా అనే కోణంలో ఫోన్ కాల్ డేటాను పోలీసులు పరిశీలిస్తున్నారు.ఈ కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్న కొత్తపేట డి.ఎస్.పి ఎస్. మురళీ మోహన్, సి.ఐ విద్యాసాగర్, ఆలమూరు ఎస్.ఐ జి. నరేష్, ఎ.ఎస్.ఐ డి. స్వామి, హెడ్ కానిస్టేబుల్ అమ్మిరాజు, కానిస్టేబుళ్లు రాజు, హనుమంత్ రాములను కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ప్రత్యేకంగా అభినందించారు.

## పాలకొండ నాగేశ్వరావు కుటుంబానికి జనసేన నేతల పరామర్శ.....



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 07:-** కాకినాడ జిల్లా శంఖవరం మండలం లోని కొంతంగి కొత్తూరు గ్రామానికి చెందిన పాలకొండ నాగేశ్వరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని జనసేన పార్టీ నాయకులు పరామర్శించి అండగా నిలిచారు. శంఖవరం మండల జనసేన పార్టీ నాయకులు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, జనసేన పార్టీ నాయకులు వరుపుల సుబ్బారావుతో కలిసి జనసేన నాయకులు పాలకొండ నాగేశ్వరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు నాగేశ్వరావు భార్య సన్యాసమ్మ ను కలిసి ఆమెకు ధైర్యం చెప్పి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
అనంతరం కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో 50 కేజీల బియ్యాన్ని అందించడంతో పాటు తగిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని జనసేన నాయకులు తెలిపారు. కుటుంబానికి ఎటువంటి అవసరం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా గొర్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ, పాలకొండ నాగేశ్వరావు మృతి తమను తీవ్రంగా కలచివేసిందని, ఆయన కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. బాధలో ఉన్న కుటుంబాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా మానవతా విలువలను చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మేకల కృష్ణ, కరణం రాజారావు, తిరుమలరెడ్డి బాబురావు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, స్థానిక కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

### గండేపల్లి మండలం మురారి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ





**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 07:**పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్" రాష్ట్రస్థాయి పోటీలు అక్టోబర్ 8, 2026న మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్నారు. అక్టోబర్ 9న ప్రదర్శన, విజేతలకు సన్మాన కార్యక్రమం గుంటూరు జిల్లా చినకాకాని హైలాండ్‌లో నిర్వహించనున్నారు.
ఈ రాష్ట్రస్థాయి కార్యక్రమానికి జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులను, ప్రతి జిల్లా నుంచి ఒక ఎస్కార్ట్ ఉపాధ్యాయుడిని పంపించేందుకు విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపికైన వారు అక్టోబర్ 8న ఉదయం 11 గంటలకు ముందుగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకుని నివేదించాల్సి ఉంటుంది.
ఈ సందర్భంగా కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం మురారి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గద్దె మహాలయ 10వ తరగతి, ఐనవిల్లి వేమని 8వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## ఆదిత్య యూనివర్సిటీలో కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో గెస్ట్ లెక్చర్.




**గండేపల్లి, పెన్ పవర్ , అక్టోబర్ 07 :** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీలోని కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో "టెక్నోవా 360డిగ్రీ -- ఏఐ బేస్డ్ లెర్నర్ టు ఇండస్ట్రీ రెడీ ఇన్నోవేటర్" అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నంలోని ఐటీ ఱ సీఏ విభాగంలో చైర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న, ప్రముఖ కార్పొరేట్ టెక్నికల్ ట్రైనర్ ఱ ఏఐ స్పెషలిస్ట్ అయిన డా. జి. సువర్ణ కుమార్ కీనోట్ స్పీకర్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ట్రెడిషనల్ లెర్నర్స్ నుంచి ఇండస్ట్రీ-రెడీ ఇన్నోవేటర్స్‌గా ఎలా ఎదగాలో వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ మరియు ఆధునిక టెక్నికల్ వర్క్‌ఫ్లోస్‌పై మంచి అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులు తమ కెరీర్ స్కిల్స్‌ను ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో వివరించారు. అలాగే ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్స్ గురించి వివరించి, భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఏఐ మరియు ఇతర ఆధునిక టెక్నాలజీలను ఎలా ఉపయోగించుకోవచ్చో తెలియజేశారు. అదేవిధంగా, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను ఉపయోగించడం ద్వారా ప్రాబ్లమ్-సాల్వింగ్ కెపాబిలిటీస్‌ను ఎలా పెంచుకోవచ్చు, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌ను ఎలా మరింత ఎఫిషియంట్‌గా మార్చుకోవచ్చు మరియు స్ట్రాంగ్ టెక్నికల్ పోర్ట్‌ఫోలియోను ఎలా బిల్డ్ చేసుకోవచ్చో విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.
ఈ కార్యక్రమాన్ని డా. పి. రాజా మోహన్ మరియు కె. హరీష్ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ప్రో-చాన్సలర్; డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్-చాన్సలర్; డా. ఎం. బి. శ్రీనివాస్, , ప్రో వైస్-చాన్సలర్ (అకడమిక్స్); డా. ఎస్. రమాశ్రీ ప్రో వైస్-చాన్సలర్ (ఇంజినీరింగ్ ఱ సైన్సెస్);,డా. ఎ. రమేష్,రిజిస్ట్రార్; డా. జి. సురేష్, , అసోసియేట్ డీన్ (స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్) డా. ఎం. వి. రాజేష్, హెచ్‌ఓడీ డా. రమేష్ ఎన్. ఎస్. వి. సి. శ్రీపాద; డిప్యూటీ హెచ్‌ఓడీ మిసెస్ ఉదయలక్ష్మి ఆదిత్య టేకి మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగానికి చెందిన ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

# నాలుగు నెలల చిన్నారికి విజయవంతంగా గుండె ఆపరేషన్

**మంత్రి సుభాష్ చొరవతో గుండె ఆపరేషన్**

**రామచంద్రపురం పెన్ పవర్, అక్టోబర్ 7:** పుట్టుకతోనే గుండెలో పెద్ద రంధ్రంతో బాధపడుతున్న నాలుగు నెలల చిన్నారి రియాన్సీ గ్రేస్‌కు మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో విజయవాడలో వైద్యులు విజయవంతంగా గుండె ఆపరేషన్ నిర్వహించారు. ద్రాక్షారామం శివారు చింతగుంట చెరువుకు చెందిన మేడిశెట్టి జీవన్ కుమార్, చంద్రిక దంపతుల కుమార్తె అయిన రియాన్సీకి అత్యవసరంగా ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించినప్పటికీ, నిరుపేద కుటుంబం కావడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌ఓసీ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు అదనపు వైద్య ఖర్చులకు సహకరించారు. ప్రస్తుతం చిన్నారి కోలుకుంటుండటంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పేదరికం కారణంగా ఏ కుటుంబం వైద్యం అందక ఇబ్బందులు పడకూడదని, ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానని మంత్రి సుభాష్ తెలిపారు.



# చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం





**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 7:** చిన్నారుల ఆరోగ్యం, పోషణ, సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం--2026 జిల్లా స్థాయి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషణ అందేలా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 'మన అంగన్‌వాడీ--మన బాధ్యత' భావనతో కేంద్రాలను ప్రజల భాగస్వామ్యంతో పనిచేసే కమ్యూనిటీ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రైవేట్ ప్రీ-స్కూళ్లకు ధీటుగా అంగన్‌వాడీల్లో నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. రక్తహీనత నివారణకు రాగి, ఉలవలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, గుడ్లు వంటి పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అధికారులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను సన్మానించి, పోషణ మాసం ప్రచార గోడపత్రిక, నూతన మెనూను ఆవిష్కరించారు.

# అంగన్‌వాడీ ఉత్సవ్‌తో పోషణపై అవగాహన




**ఆత్రేయపురం, పెన్ పవర్ అక్టోబర్ 7:** చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా "మన అంగన్‌వాడీ--మన విద్య అంగన్‌వాడీ ఉత్సవ్" కార్యక్రమాన్ని ఆత్రేయపురం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఏ. గజలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్యం, ప్రాథమిక విద్య, పరిశుభ్రత తదితర అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, పిల్లల పెరుగుదల--అభివృద్ధిని పర్యవేక్షించే విధానం, పోషకాహార ప్రాధాన్యతను అధికారులు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కే. పద్మావతి, వై. అరుంధతి, ఎంపీడీవో పీవీఆర్‌కే రాము, పంచాయతీరాజ్ సిబ్బంది, డిప్యూటీ ఎంపీడీవో, ఏపీఎం, ఆర్ఎండీ గంగాధర్, బీజేపీ నాయకులు చేకూరి రమేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 7:** ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా కాకినాడ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పిఠాపురంలోని హనుమంతరాయ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ దుర్వినియోగం, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, సరఫరా,నిల్వలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించాలని, 'రైజ్ ఎగైనెస్ట్ గాంజా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించడంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఓటీపీ, బ్యాంకు ఖాతా,ఏటీఎం వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. లోన్ యాప్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.అత్యవసర పోలీసు సహాయం కోసం 112, సైబర్ ఆర్థిక మోసాలపై వెంటనే ఫిర్యాదు చేసేందుకు 1930, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం కోసం 1972 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పిఠాపురం అడిషనల్ ఎస్సై డి. లోకేష్, వుమెన్ పీసీ సంతోషి, కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జగన్నాథపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ






**జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 7:** కాకినాడ అర్బన్ మండలం జగన్నాథపురం నరసింహ రోడ్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అసిస్టెంట్ కలెక్టర్ ప్రియాతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పేద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ ఓపీ రిజిస్ట్రేషన్, వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణం, మరుగుదొడ్ల పరిశుభ్రత, మందుల నిల్వలు, గడువు తేదీలు, ఉచితంగా అందిస్తున్న మందుల వివరాలను పరిశీలించారు. ప్రయోగశాలను సందర్శించి వివిధ వైద్య పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు.వైద్యం కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, సేవలు ఎలా ఉన్నాయి, మందులు సక్రమంగా అందుతున్నాయా అనే వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పినపళ్ళలో ఘనంగా అంగన్వాడి ఉత్సవం.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 07:** ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాజీవితం నేపథ్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా ఆలమూరు మండలంలోని పినపళ్ళ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అంగన్వాడీ ఉత్సవం నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఓ గజలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్వైజర్ నాగ సత్యవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగిత సుభాష్,ఏఎంసి మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు పాల్గొని చిన్నారులు, వారి తల్లులతో ముచ్చటించారు. ముందుగా వారి సహకారంతో గ్రామంలోని గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయ పద్ధతిలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం,ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రధాని 25 ఏళ్ళ ప్రజాసేవ సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రభా సేవాభావాన్ని బలోపేతం చేస్తున్నాయన్నారు. చిన్నారుల శారీరక,మానసిక, సామాజిక అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకమని, తల్లిదండ్రులు అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి పట్టాభి రామయ్య,యనమదల శ్రీను, కొత్తూరి సాయి,వక్కపట్ల రాంబాబు, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు, ఏఎన్ఎం,ఆశా వర్కర్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన పర్వత రాజబాబు జానకి దేవి....





**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 07:-** వైఎస్ఆర్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం రాత్రి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శంఖవరం తాజా మాజీ ఎంపీపీ పర్వత రాజబాబు జానకి దేవి, కుమారుడు పర్వతవివేక్ మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఉన్నారు. ఎదుట వారిని ఆప్యాయంగా పలకరించడంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ది ఒక ఆత్మీయ పలకరింపు. అతని వారసుడు జగన్ మోహన్ రెడ్డి అదే రీతిలో అమ్మ జానకి దేవి బాగున్నావా అని ఆప్యాయంగా పలకరించారు. పర్వత రాజబాబు ఇటీవల పార్టీ మారుతున్నట్లు పెద్ద ఎత్తున చర్చ జరిగింది. పర్వత రాజబాబు కుటుంబం జగన్ మోహన్ రెడ్డిని కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్లు అయింది. దీనితో శంఖవరం మండలం వైసీపీ శ్రేణులు బుధవారం శంకవరంలో పర్వత రాజబాబు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ త్వరలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ని, నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలవడం జరుగుతుందని అన్నారు. తరువాత వైయస్సార్సీపి పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటానని, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరాల శ్రీనివాస్, గౌతు వాసు, ఈగల గంగ, సకురు గుర్రాజు, యడ్ల సత్య నారాయణ, మామిడి దేవుళ్ళు, శాంతి భరత్, సూరకాసుల నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారా స్విమ్మింగ్‌లో సచివాలయ ఉద్యోగి లంక నాగేశ్వరరావుకు పతకాలు




**కాకినాడ పెన్ పవర్ అక్టోబర్ 7:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 8వ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ --2026లో కాకినాడ నగరానికి చెందిన లంక నాగేశ్వరరావు ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలను సాధించారు. విజయవాడలోని మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్, సిర్విజ్జీ స్విమ్మింగ్ పూల్‌లో అక్టోబర్ 5న నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో ఈ పోటీలు నిర్వహించారు. కాకినాడ నగరపాలక సంస్థలోని 30వ వార్డు సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న లంక నాగేశ్వరరావు పారా స్విమ్మింగ్‌లోని వివిధ విభాగాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 100 మీటర్ల బటర్‌ఫ్లై, 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగాల్లో పోటీపడి బంగారు, వెండి పతకాలను సాధించారు. ఈ విజయంతో కాకినాడ నగరానికి గుర్తింపు తీసుకొచ్చారు. నాగేశ్వరరావు సాధించిన విజయంపై కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అభినందనలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 30వ వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ లంక నాగేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. నవంబర్‌లో భూపాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి తెలుగువారి సత్తాను చాటాలని కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆకాంక్షించారు. నాగేశ్వరరావు సాధించిన విజయం ఇతర సిబ్బందితో పాటు యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, డీసీపీ కె.వి.కృష్ణారావు, టీపీఆర్ఓ సతీష్ తదితరులు నాగేశ్వరరావును అభినందించారు.

## కిర్లంపూడి మండలం వేలంకలో పల్లె పండుగ 3.0

* 2 కోట్ల14 లక్షలతో వేలంక రోడ్డుకు శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**కిర్లంపూడి,పెన్ పవర్ అక్టోబర్,7:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ఘనంగా జరిగింది.చిల్లంగి నుండి వేలంక మీదుగా పెద్దనాపల్లి వరకు 2 కోట్ల 14 లక్షల అంచనాలతో 3.735 కి.మీ. రోడ్డు నిర్మాణానికి జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాకే గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టిందన్నారు. గత గొడ్డలి పార్టీ పాలనలో రోడ్లు శిథిలావస్థకు చేరాయని అడుగడుగునా గుంతలు బురదమయంగా ఉండేవని ప్రజలు బయటకు రావాలంటే నరకం చూసేవారని అన్నారు. రైతులు విద్యార్థులు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు.కూటమి ప్రభుత్వం పల్లె పండుగ ద్వారా ప్రతి గ్రామంలో రోడ్లు వేస్తోందని చిల్లంగి వేలంక పెద్దనాపల్లి రోడ్డు ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అని 2.కోట్ల 14 లక్షలతో ఈ రోడ్డు పూర్తయితే 3 గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయని అన్నారు. ఇది కూటమి ప్రభుత్వం పల్లెలకు ఇస్తున్న భరోసా అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు, మారిశెట్టి భద్రం, మండల తెలుగు యువత అధ్యక్షుడు గండే కాశీ చదరం చంటిబాబు, తూము కుమార్, గండే చినరాజు, గుడాల రాంబాబు, బోదిరెడ్ల సుబ్బారావు,గొడే బాల, ఇంటి చెల్లారావు,కూటమి నాయకులు అధికారులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువుల మాఫియా, భూ మాఫియా ఆగడాలను అరికట్టాలి.

* ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి,కెఎస్ శ్రీనివాస్.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,అక్టోబర్,07:**ప్రత్తిపాడు మండలంలో పేదల భూములను ఆక్రమించుకుని ఆ భూములలో ఉన్న గ్రావెల్ ను అమ్ముకుని కోట్లు గడిస్తున్న మట్టిమాఫియా ఆగడాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి,కె ఎస్ శ్రీనివాస్ డిమాండ్ చేసారు. అలాగే గోసాలల పేరుతో పశువులను కబేలాకు తరలిస్తున్న మాఫియా పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్తిపాడు మండలంలో మట్టి మాఫియా, పశువుల మాఫియాకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న కారణంగా దాడికి గురైన ప్రజాశక్తి విలేకరిని రమేష్ ను బుధవారం శ్రీనివాస్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను పెద్దలు కాజేసి ఆ భూములలో ఉన్న గ్రేవల్ ను అమ్ముకుని కోట్లు గడిస్తున్నారని, పేదలు మాత్రం ఉన్న ఆ కాస్త భూమిని కూడా కోల్పోయి మరింత పేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పేదలకు అండగా ఉంటూ వార్తలు రాస్తున్న ప్రజాశక్తి విలేకరి రమేష్ పై దాడి చేసిన వారందరి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా పత్రికా విలేకరులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రమేష్ ను ప్రజాశక్తి రాజమహేంద్రవరం డివిజన్ ఇంచార్జ్ రవీంద్ర, అన్నవరం ప్రజాశక్తి రిపోర్టర్ హరి గోపాల్ తదితరులు పరామర్శించారు.ు

## కాకినాడలో ఘనంగా సేవా సేతు అభియాన్ ర్యాలీ






**కాకినాడ, పెన్ పవర్ అక్టోబర్ 7:** సేవా సేతు అభియాన్‌లో భాగంగా సౌర విద్యుత్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాకినాడ కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ పథకాలపై అవగాహన గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రజలు సౌర విద్యుత్ పథకాలపై అవగాహన పెంచుకుని ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న సేవా సేతు అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న సోలార్ సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఒక కిలోవాట్‌కు సుమారు రూ.30 వేల నుంచి, మూడు కిలోవాట్ల వరకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 13,788 మంది ఈ పథకాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూఫ్‌టాప్ సోలార్ సదుపాయాన్ని ఉచితంగా కల్పిస్తుండగా, ఇప్పటికే 10,246 మంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని వివరించారు.సోలార్ విద్యుత్ వినియోగంతో విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గుతున్నాయని, అర్హులైన ప్రజలంతా ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఎనర్జీ కన్జర్వేషన్ సోలార్ చీఫ్ జనరల్ మేనేజర్ జి. శ్యాంబాబు, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎన్. ఉదయ్ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరప మండలంలో కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన





**కాకినాడ రూరల్/కరప, పెన్ పవర్,అక్టోబర్ 7:** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రియాతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఈ-క్రాప్ నమోదును పరిశీలించిన కలెక్టర్ ప్రతి ఎకరం సాగు భూమి వివరాలు పక్కాగా నమోదు చేయాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, రికార్డులను పరిశీలించారు.చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు.నడకుదురు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత,తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.నడకుదురు స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సిబ్బంది హాజరు,సర్టిఫికెట్ల జారీ, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వ సేవల్లో జాప్యం లేకుండా చూడాలని,ప్రజల అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం,తాగునీటి వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ ఎ.లక్ష్మీ సరస్వతి,ఎంపీవో ఐ.సత్య,రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చింతలూరులో ఘనంగా అంగన్వాడి ఉత్సవం.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 07:**మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలోని చింతలూరు ఒకటవ,రెండవ, మూడవ అంగన్వాడి కేంద్రాల్లో బుధవారం ఘనంగా అంగన్వాడి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిడిపిఓ గజలక్ష్మి సూచనలు మేరకు సూపర్వైజర్ నాగ సత్యవేణి పాల్గొని గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను వివరించారు. మూడు సంవత్సరాలు పూర్తైన చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని, కాన్వెంట్లకు పంపకుండా అంగన్వాడి విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆటలు, పాటల ద్వారా పిల్లల సమగ్ర శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే ప్రతి ఆహార వస్తువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సాంప్రదాయ పద్ధతిలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైట్ల గంగరాజు, వైట్ల శేషబాబు, దేశాబత్తుల సత్యనారాయణ, పాలంకి ధన్వఃతరి శర్మ, పాదూరి శ్రీనివాస్, తాళ్ల రాజు, అప్పారి శివ నారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు నెక్కంటి ధనలక్ష్మి, సోమిరెడ్డి విజయలక్ష్మి, డిపి రామలక్ష్మి, అంగన్వాడి హెల్పర్లు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి దేవస్థాన ట్రస్ట్ బోర్డు కీలక నిర్ణయాలు





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 7:**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థాన ట్రస్ట్ బోర్డు సమావేశం బుధవారం ఆలయ కార్యాలయం లో జరిగింది ఈ సమావేశానికి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) అధ్యక్షతన పలు కీలక అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు.శ్రీవారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలను అక్టోబర్ 29 నుంచి నవంబర్ 6 వరకు వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. పూల అలంకరణలు, మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల వాహన సేవల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రాష్ట్రాల సాంప్రదాయ వాయిద్య బృందాలను ఏర్పాటు చేయనున్నారు.బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వాడపల్లి, పరిసర ప్రాంతాల నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని తీర్మానించారు. సెప్టెంబర్ నెల ఆలయ జమా-ఖర్చులను పరిశీలించి ఆమోదించడంతో పాటు, దేవస్థాన అవసరాలకు టాటా ఏస్, అప్పి వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు.అలాగే డిసెంబర్ 20న జరగనున్న ముక్కోటి ఏకాదశి మహోత్సవానికి భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ "కర్రి శ్రీనివాస్"కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 07:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మేనేజ్మెంట్ స్టడీస్, స్కూల్ ఆఫ్ బిజినెస్ నందు అసిస్టెంట్ గా పనిచేస్తున్న" కర్రి శ్రీనివాస్"ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం కి చెందిన డి.సి.ఎం.ఎస్. విభాగాధిపతి డా. ఎన్.ఉదయభాస్కర్ నేతృత్వంలో శ్రీనివాస్ సమర్పించిన "థీసిస్ శీర్షిక: " ది ఇంపాక్ట్ ఆఫ్ టెక్నాలజీ -ఎనేబుల్డ్ సర్వీస్ క్వాలిటీ ఆన్ కస్టమర్ లాయల్టీ ఇన్ పబ్లిక్ ట్రాన్స్పోర్టేషన్ విత్ రిఫరెన్స్ టు ఏ.పి .ఎస్.ఆర్.టి.సి " అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా." కర్రి శ్రీనివాస్ " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా. శ్రీనివాస్ కు అభినందనలు తెలియజేశారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గంలో టిడిపికి బిగ్ షాక్.





**-శంఖవరం గ్రామానికి చెందిన 55 కుటుంబాలు వైసీపీలోకి చేరిక.**

**-పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి కండువా కప్పిన వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు.**

**కిర్లంపూడి/పెన్ పవర్,అక్టోబర్, 07:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం గ్రామానికి చెందిన 55 తెలుగుదేశం పార్టీకి చెందిన కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

శంఖవరం గ్రామానికి చెందిన పొలమాటి శాంతి, భరత్, కనికెళ్ల బ్రెనెట్ బాబు, మణిబాబు, మాజీ కో ఆప్షన్ సభ్యులు బెనర్జీ తదితరులు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కిర్లంపూడి ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలసి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ముద్రగడ గిరిబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఏ సమయంలో పిలిచినా అందుబాటులో ఉంటానని తెలియజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేయడమే కాకుండా,పార్టీని మరింత బలోపేతం చేసి భవిష్యత్తులో వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని గిరిబాబు పిలుపునిచ్చారు.ముద్రగడ గిరిబాబు నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేస్తామని కొత్తగా పార్టీలోకి చేరిన కార్యకర్తలు స్పష్టం చేశారు.

# కొబ్బరి చెక్కల టెండర్‌తో వాడపల్లి దేవస్థానానికి భారీ ఆదాయం





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 7:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన వార్షిక టెండర్లు ఆసక్తికరంగా మారాయి. ఆలయ పరిసరాల్లో పోగయ్యే కొబ్బరి చెక్కల హక్కు నిర్వహణకు జరిగిన టెండర్‌లో తిమ్మాపురానికి చెందిన శ్రీ పవన్ సూర్య ట్రేడర్స్ రూ.2,03,49,999 అత్యధిక పాటతో హక్కును దక్కించుకుంది. దీంతో గత ఏడాదితో పోలిస్తే దేవస్థానానికి రూ.40,16,666 అదనపు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.ఇదే సమయంలో శ్రీవారికి నిత్య పూల అలంకరణకు సంబంధించిన టెండర్‌ను వాడపల్లికి చెందిన పైడికొండల వీరబాబు దక్కించుకున్నారు. తులాభారం నిర్వహణ హక్కుకు సరైన టెండర్ రాకపోవడంతో ఆ ప్రక్రియను వాయిదా వేశారు. శ్రీవారి చిత్రపటాలు, జూట్ బ్యాగులు, వార్షిక క్యాలెండర్లు, లడ్డు కవర్లతో పాటు ఇతర అవసరాలకు సంబంధించిన టెండర్లను కూడా ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో నిర్వహించారు.ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు, చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), దేవదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తుల సమక్షంలో టెండర్ ప్రక్రియ కొనసాగింది. కొబ్బరి చెక్కల హక్కు ద్వారా గతేడాదికంటే గణనీయంగా పెరిగిన ఆదాయం దేవస్థాన ఆర్థిక వనరులకు మరింత బలం చేకూర్చే అంశంగా నిలిచింది.

## గెడ్డం సంపద రావు మృతి బహుజన సమాజానికి తీరని లోటు...

### బీఎస్పీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కుటుంబానికి గునపర్తి అపురూప్ ప్రగాఢ సానుభూతి...



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 07:-** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ప్రస్తుత రాష్ట్ర కోఆర్డినేటర్ గెడ్డం సంపద రావు అకాల మరణం బహుజన సమాజానికి తీరని లోటని బీఎస్పీ ప్రత్తిపాడు అసెంబ్లీ ఇంచార్జ్ గునపర్తి అపురూప్ అన్నారు.
గెడ్డం సంపద రావు మృతి పట్ల గునపర్తి అపురూప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బహుజనుల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బహుజన ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు.
ఈ విషాద సమయంలో గెడ్డం సంపద రావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఘనమైన అశ్రునివాళి అర్పిస్తున్నట్లు గునపర్తి అపురూప్ పేర్కొన్నారు.

## మురళీకృష్ణంరాజుకు ముద్రగడ గిరిబాబుతోపాటు పలువురు నాయకులు పరామర్శ.





**కిర్లంపూడి,ప్రత్తిపాడు, పెన్ పవర్,అక్టోబర్,07:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు కుటుంబానికి బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. కృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు ఇటీవల మృతి చెందారు. బుధవారం పెదకార్యం కావడంతో విషయము తెలుసుకున్న అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు,కూటమి నాయకులు మురళీ కృష్ణంరాజు, ఆయన సోదరుడు సీతారామరాజుతోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయడమే కాకుండా, రామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు, రామచంద్రపురం నియోజకవర్గం ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ రావు,ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకులు, వరుపుల సుబ్బారావు, రాష్ట్ర ఖాదీ పరిశ్రమల శాఖ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,వైసిపి నాయకులు జ్యోతుల రామస్వామి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అంగూరి లక్ష్మీ శివకుమారి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా, జువ్వల చినబాబు, రామిశెట్టి నాని, సకురు గుర్రాజు,పెంటకోట నాగబాబు, జలిగంపల ప్రభాకర్ రావు, బండారు మూర్తి, కుండల అప్పారావు, అడపా సోమేష్, బుద్ధ గణేష్, పైలా సుభాష్ చంద్రబోస్ దడాల సతీష్, కాకినాడ జిల్లా టిడిపి వాణిజ్య విభాగం సభ్యులు పోలిశెట్టి శ్రీనివాస్ రావూరు తాతాజీ మాజీ ఎంపీపీ గోళ్ళ కాంతిసుధాకర్,కోలా తాతబాబు ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు పాత్రికేయులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కూటమి నాయకులు, మురళీ కృష్ణంరాజు అభిమానులు భారీగా తరలివచ్చి మురళీకృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పాండవులపాలెంలో ఘనంగా వన్యప్రాణి వారోత్సవాలు



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 07:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడవి, వన్యప్రాణులపై, విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు అడవి వల్ల ఉపయోగాలు,వన్యప్రాణుల ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దుర్గారాంప్రసాద్, ప్రధానోపాధ్యాయులు అబ్బాయి దొర,టీచర్ జి నూకరత్నం, శంఖవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి, జి నాగేశ్వరరావు, రౌతులపూడి సెక్షన్ అధికారి, పి శ్యాం కుమార్,అటవీ శాఖ సిబ్బంది,పి చిహెచ్, బొర్రమ్మ, పి లావణ్య, కె భీమశంకర్,వై రాజ్ కుమార్, డి శ్రీవిద్య,కె మూర్తి,సాహెబ్,పలువురు సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం





**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 7:** జగ్గంపేట కాపు కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, కాకినాడ జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో కిసాన్ మేళా 2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆహ్వానితులందరికీ ఘన స్వాగతం పలికి, రైతులకు పలు అంశాలపై సూచనలు సలహాలు అందజేసిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గరిమెళ్ళ శ్రీనివాస్ అనంతరం వ్యవసాయం, అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను పరిశీలించారు. ఆధునిక పరికరాలు, నూతన వంగడాలు, ప్రకృతి ఎరువుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా అనేక పంటలు పండించాలని, ప్రతి రైతు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం ఉన్నందున ఆరుతడి పంటలు వేసుకోవాలని, రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని, మూడు పంటలకు ఒకసారి విత్తన మార్పిడి చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ ద్వారా జగ్గంపేట నియోజకవర్గంలోనే 71 కోట్ల 94 లక్షలు రైతులకు అందించామని, సహకార రుణాలకు వన్ టైం సెటిల్మెంట్ త్వరలో తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడప భరత్, ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, రాష్ట్ర డైరెక్టర్లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, జీను మణిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, సొసైటీ చైర్మన్ లు, బుర్రి సత్తిబాబు, ఉప్పలపాటి బుల్లెబ్బు, కంటిపూడి సత్యనారాయణ, కందుల కొండయ్య చౌదరి, దిడ్డి శ్రీను, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, ఆత్మ జిల్లా పిడి రాబర్ట్ పాల్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ ఎలియాజర్, ఏడిహెచ్ రామస్వామి, డిహెచ్ఓ సిరిల్, ఏపిడి ఏపిఎంఐపి ప్రసాద్, ఏడిఏ బిసిఎల్ రత్నా ప్రశాంతి, పెద్దాపురం, మార్టేరు శాస్త్రవేత్తలు రామభద్ర రాజు , నరసింహారావు, పెద్దాపురం ఉద్యాన శాస్త్రవేత్త సునీత, పెద్దాపురం ఏడిఏ దయకుమార్, రాజమండ్రి వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీత, జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి ఎస్ నరసింహం, రైతులు పాల్గొన్నారు.

## ప్రేమ్ కుమార్ కుటుంబానికి జనసేన నేత డాక్టర్ దేగల నాగేంద్ర రూ.50 వేల సాయం



**కాజులూరు పెన్ పవర్, అక్టోబర్ 7:** అమలాపురం నియోజకవర్గం బెండమూరులంక గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త రోళ్ల ప్రేమ్ కుమార్ కుటుంబానికి జనసేన పార్టీ తరఫున రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రేమ్ కుమార్ కుటుంబానికి పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇందులో అమెరికాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ జనసైనికుడు రూ.2 లక్షలు, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ రూ.50 వేలు, రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన డాక్టర్ దేగల నాగేంద్ర రూ.50 వేలు అందించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**ఆలమూరు,పెన్ పవర్, అక్టోబర్ 07:**రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యాబోధన కోసం అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తాత్కాలికంగా నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా ఆలమూరు మండలంలోని మూలస్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎంఈఓ 1 బి.అప్పాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బి.ఈడి పూర్తిచేసి, టెట్ అర్హత సాధించిన స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. నెలకు రూ.12,500 గౌరవ వేతనం చెల్లిస్తారని, వేసవి సెలవుల్లో వేతనం ఉండదని స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియ జిల్లా సెలెక్షన్ కమిటీ డీఎస్సీ ద్వారా జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 8, 9 తేదీల్లో తమ దరఖాస్తులను ఆలమూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు అన్నారు.

## వైసీపీలోకి భారీ చేరికలు... ప్రత్తిపాడులో టిడిపికి బిగ్ షాక్...



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 07:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో మండల కేంద్రమైన శంఖవరం గ్రామం టీడీపీ కి చెందిన 55 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరారు. శంఖవరం గ్రామం లో పొలమాటి శాంతి భరత్, కనికెళ్ల బ్రెనేట్ బాబు, మణిబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి లోని ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు వారందరికీ వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ముద్రగడ గిరిబాబు హామీ ఇచ్చారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గిరిబాబు నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేస్తామని కొత్తగా చేరిన కార్యకర్తలు స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం..
## అడ్డతీగల తాసిల్దార్ తేజస్విని.. నవంబర్ 6 చివరి తేదీ ..



**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్,07;**ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ (టీచర్స్ ఎమ్మెల్సీ) ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని అడ్డతీగల తహశీల్దార్ తేజస్విని ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అర్హులైనఉపాధ్యాయు లందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గానీ, లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కార్యాలయంగానీ నేరుగాసమర్పించవచ్చని వెల్లడించారు. అలాగే ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ (సిఈఓఆంధ్రా.యన్ఐసి.కమ్) ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని అడ్డతీగల తాసిల్దార్ తేజస్విని తెలిపారు. ఈ దరఖాస్తుల స్వీకరణకు 2026 నవంబర్ 6వ తేదీని తుది గడువుగా నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.ఉపాధ్యాయ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అభ్యర్థులు నిర్దేశిత అర్హతలు కలిగి ఉండాలని తహశీల్దార్ వివరించారు. దరఖాస్తుదారులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నివాసి అయి ఉండటంతో పాటు, కనీసం ఆరేళ్ల బోధనా అనుభవం కలిగి ఉండాలి. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఓటరు గుర్తింపు కార్డు , పాస్‌పోర్ట్ సైజు ఫోటో, క్రియాశీల మొబైల్ నంబర్ జతచేయాల్సి ఉంటుంది. వీటితో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న విద్యాసంస్థ అధిపతి నుంచి ధ్రువీకరించిన 'అనెక్సర్-2' పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ సర్టిఫికెట్లపై సంబంధిత ఆర్జేడీ , ప్రిన్సిపాల్ లేదా హెచ్ఓడీ చేత కౌంటర్ సంతకం చేయించి తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.అర్హులైన ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులందరూ గడువులోగా దరఖాస్తు చేసుకుని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ తేజస్విని విజ్ఞప్తి చేశారు.

## వి.ఆర్.పురం టిడిపిపార్టీ యూనిట్,సమావేశం





**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.7:**వి.ఆర్.పురం తెలుగుదేశంపార్టీ బృందం బుధవారం చింతూరు ఐ.టి.డి.ఏ.పిఓను మర్యాదపూర్వకంగా కలిసి,శాలువాతో సత్కరించారు.అనంతరంఅక్టోబర్ నెలలో మొదటిబుధవారం వి.ఆర్.పురంయూనిట్ సమావేశం యూనిట్ ఇంచార్జ్ బొర్రా నరసింహారావు అధ్యక్షతనలో నిర్వహించడం జరిగింది.ఈసమావేశం లోటిడిపిపార్టీబృందం మాట్లాడారు.ప్రభుత్వంప్రకటించిన 2025వ.సంవత్సరంలోవచ్చిన గోదావరివరదలలోఇవ్వ వలసిన,మూడువేలరూపా యలువరదబాధితులసహాయంఇంతవరకుఇవ్వలే దని,వడ్డిగూడెంపంచాయితీలోని బీసీకాలనీ,(పోల వరం)గృహాల నష్ట పరిహారంత్వరత్వరగా ఇప్పించా లని,ప్రభుత్వాన్ని,కోరుతూ తీర్మానించడం జరిగింది.ఈసమావేశంలో మండలపార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,యూనిట్ ఇంచార్జ్ బొర్రా నరసింహా రావు కో కన్వీనర్,ముత్యాల శ్రీధర్ జిల్లా పరిషత్ స్కూల్ వైస్ చైర్మన్ మోదుగు వెంకన్నబాబు,మాజీ సొసైటీ అధ్య క్షులు ముత్యాల చంద్రశేఖర్,శ్రీ సతీపార్వతీ రుద్రకోటేశ్వర స్వామిఆలయ ట్రస్ట్,అధ్యక్షులు బొర్రా ఆదినారాయణ సీనియర్ నాయకులు ముత్యాల రామారావు,సత్య నారాయణ,బింగివిష్ణు, ముత్యాలశంకర్రావు,ముత్యాల చక్రపాణి,ముత్యాలనరేష్,తదితరులుపాల్గొన్నారు.

## ఘనంగా అంగన్వాడీ ఉత్సవం



**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.7:**మండలంలోని వడ్డిగూడెం,అంగన్వాడీ:2లో బుధ వారంవి.ఆర్.పురం,కూనవరం,ఐ.సి.డి.ఎస్.ప్రాజెక్టు అధికారి,వి.మల్లికఆద్వర్యంలో 9వ.జాతీయపోషణ మాసంలోభాగంగా ఘనంగా అంగన్వాడీ,ఉత్సవం నిర్వహించడంజరిగింది.ఈ సందర్భంగా బి.జె.పి. పార్టీజిల్లా కామేశ్వరి,మాట్లా డారు.1.పిల్లలు-ఆరోగ్యం 2.పోషణ3.సమగ్రాభివృద్ధి పథకాలు పి.ఎం.ఎం.వి.వై.మిషన్,వాత్సల్య,మిషన్,శక్తి సాక్షం,అంగన్వాడీల ఆధునీకరణపోషణ2.0.కమ్యూనిటీ సామాజికవేడు కలు,గురించిఅవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ,వర్కర్,పి.విజయలక్ష్మి,బాలింతలు,గర్భిణీ స్త్రీలు,బాలబాలికలు, తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే తల్లి, శిశువుల ఆరోగ్య పరిరక్షణ





✷ యెళిశెట్టివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాస ఉత్సవం

**కొత్తపేట, పెన్‌పవర్, అక్టోబర్ 7:** తల్లి ఆరోగ్యమే శిశువు ఆరోగ్యానికి పునాది అని, గర్భధారణ నుంచే పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సిబ్బంది సూచించారు. బిళ్లకుర్రు గ్రామంలోని యెళిశెట్టివారిపాలెం 124వ అంగన్‌వాడీ కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నిర్వహించిన మాస ఉత్సవంలో తల్లులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య, పోషకాహారంపై అవగాహన కల్పించారు.గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని, తగినంత విశ్రాంతి అవసరమని సిబ్బంది వివరించారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే ఆహారం శిశువు ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, ఇతర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల ఆహారం కీలకమని పేర్కొన్నారు. పిల్లలకు వయసుకు అనుగుణంగా పోషక విలువలున్న ఆహారం అందించడం, పరిశుభ్రత పాటించడం, సకాలంలో టీకాలు వేయించడం, ఎదుగుదలను పర్యవేక్షించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.మాస ఉత్సవంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించి, పరిశుభ్రమైన, పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. గర్భిణులకు సీమంత కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చిన్నారుల సంరక్షణలో తల్లుల పాత్రను గుర్తిస్తూ వారిని సన్మానించారు.సీడీపీఓ గజలక్ష్మి, సూపర్‌వైజర్ హిమశ్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు యెళిశెట్టి రామకృష్ణ చిన్న, అవిశెట్టి ప్రసాదు, యెళిశెట్టి త్రిమూర్తులు, యెళిశెట్టి రాము, యెళిశెట్టి శివ, యెళిశెట్టి రాంబాబు, శ్రీకాకోళపు శ్రీనివాస గుప్తా, శ్రీకాకోళపు రామారావు గుప్తా, యెళిశెట్టి చిన్నబ్బులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.కామేశ్వరి, ఆయా ఎం.విజయకుమారి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలమూరు జనార్దనస్వామిని దర్శించుకున్న పల్నాడు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల భక్తులు





**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 07:**ఆలమూరు శ్రీదేవి,భూదేవి సమేత జనార్దనస్వామి వారిని పల్నాడు జిల్లా నరసరావుపేట, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అన్నవరం రాజమహేంద్రవరం నుంచి వచ్చిన భక్తులు బుధవారం దర్శించుకున్నారు. బుధ గ్రహ అనుబంధ క్షేత్రంగా ఉన్న జనార్దనస్వామి వారి ఆలయాన్ని బుధవారం నాడు దర్శించుకోవడం తమకు ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. వచ్చిన భక్తులకు ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఆలయ ఈవో బి. నరేంద్ర కుమార్ వారికి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు అంగర భగవాన్ ఆచార్యులు క్షేత్ర వైశిష్ట్యాన్ని తెలియజేశారు. నారద మహర్షి చేత కృతయుగంలో స్వామి వారు ప్రతిష్ఠించబడ్డారని, జనుల బాధలను తీర్చే స్వామి జనార్దన స్వామి అని, స్వామివారి మహత్యాన్ని వారికి వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆలయాన్ని దర్శించుకునీ భక్తులు తన్మయత్వం పొందారు.

## న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన, నిరాహారదీక్ష లకు పలువురు నేతలు మద్దతు.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 07.**ఆంధ్రప్రదేశ్ లో అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్ట్ అమలు చేయాలని కోరుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫెడరేషన్ ఏలూరు పిలుపు మేరకు ది. 05-10-2026 సోమవారం నుండి ది. 09- 10- 2026 శుక్రవారం వరకు జరుగు కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్షలకు తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు భవన సముదాయ వద్ద బుధవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు తెలియజేస్తూ, రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ నిరసన దీక్షకు స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఉప ముఖ్యమంత్రివర్యులు కొట్టు సత్యనారాయణ, బిజెపి నాయకులు కర్రి ప్రభాకర బాలాజీ, , బిజెపి రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షురాలు గట్టిం. సింధు, బిజెపి రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్ జీ.కే.ఆనంద్ న్యాయవాదుల శిబిరం దగ్గరకు వచ్చి తమ మద్దతును తెలియజేశారు న్యాయవాదులు న్యాయమైన కోర్కెలు నెరవేర్చటానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని వారు అన్నారు. మూడవ రోజు బుధవారం కార్యక్రమంలో బార్ అసోసియేషన్ పూర్వాధ్యక్షులు దూలం వెంకట విజయకుమార్, కార్యవర్గ సభ్యులు శనివారపు వెంకట రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఆర్. యస్.వి.సోమేశ్వరరావు, వెదుళ్ళపల్లి లీలా కృష్ణ సాయి ప్రసాద్, పంగిడి కోటేష్, తోట సత్యనారాయణ డివిఎస్ రవిప్రసాద్, ఎం. గజేంద్ర శ్రీనివాస్ అద్దంకి విజయరత్నం మరపట్ల అజయ్,ఈడా ఫరోత్ బాబు, వీర్రాజు,పమ్మి వీర భద్రుడు, ఎం.చిన్ని కృష్ణమాచార్యులు, మాకా సత్యనారాయణ, ఎం. జగదీష్, వైబోయిన మారుతి దుర్గాప్రసాద్, పి. వెంకట లక్ష్మి తదితరులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

## 10 న మహాలయ సమారాధన





**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 7:** తాళ్లపూడిలో ఈనెల పదవతేదీ శనివారం మహాలయ అమావాస్య సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు కవల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని గౌతమేశ్వర స్వామి సన్నిధిలో ఆవిష్కరించారు. తాళ్లపూడి గోదావరి గట్టువద్ద ఉన్న పురాతన గౌతమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఆరు సంవత్సరాలుగా పితృ ప్రేమికుల సహకారంతో మహాలయ అమావాస్య అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. పితృదేవతల శాపాలు, దోషాలు తొలగి సకల దేవతల ఆశీస్సులు లభించే ప్రత్యేకత మహాలయ అమావాస్యకు ఉందని పురాణ ఉపన్యాసకులు పరస రాధాకృష్ణ పేర్కొన్నారు. విశేషమైన అన్నదానం, జలదానం చేసి కర్ణుడు అన్నదాన ఫలితాన్ని పొందిన మహాలయ అమావాస్య రోజున చేసే అన్నదానానికి వెయ్యరెట్లు అధిక ఫలితం లభిస్తుందని రాధాకృష్ణ తెలిపారు. కవల శ్రీనివాస్ వంటి నిస్వార్థ సేవకులు చాలా అరుదుగా ఉంటారని పరస రాధాకృష్ణ ప్రశంసించారు. మహాలయ అమావాస్య అన్న సమారాధన, కార్తీక మాసంలో గోదారి రేవులో అఖండ దీపారాధన, వెన్నెల్లో సీతారామ కళ్యాణం, మహాశివరాత్రి రోజున ఇరవై అడుగుల లింగోద్భవ జ్యోతి ఏర్పాటు, ఉసిరిచెట్టు కింద కార్తీక సమారాధన, గోసేవ వంటి కొన్ని అరుదైన ప్రత్యేక కార్యక్రమాలను నిస్వార్థంగా నిర్వహిస్తున్న కవల శ్రీనివాస్ సేవలను సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందని గణపతి యువజన సంఘం ప్రతినిధి డివివి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిల్లాని అప్పారావు, నందమూరి మణికంత, కిల్లాని లక్ష్మణరావు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com